

సందడే.. సందడి

పాతూరులో సంక్రాంతి పండుగ జనం రద్దీ..

నేడు భోగి



పండుగకు రంగులు కొంటున్న మహిళలు

- సంక్రాంతి సంబరాలకు సర్వం సిద్ధం
- కొనుగోలు దారులతో దుకాణాలు కిటకిట

అనంతపురం కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలకు జిల్లా సిద్ధమవుతోంది. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా పండగ సందడి మొదలైంది. సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని అవసరమైన వస్తువుల కొనుగోలుకు మార్కెట్లకు ప్రజలు ఆదివారం పోటెత్తారు. పంటలన్నీ చేతికి రావడంతో గ్రామీణ ప్రజలు కొత్త వస్తువులు కొనడానికి నగరబాట పట్టారు. ముఖ్యంగా అనంతపురం నగరంలో దుస్తుల దుకాణాలు, సెల్‌ఫోన్ షాపులు, నిత్యావసర సరుకుల దుకాణాలు, పూల అంగళ్లు, పూజా సామగ్రి షాపులు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. ఇంటి ముందు ముగ్గులు వేయడానికి రంగులు కొనుగోలు చేస్తూ, గుమ్మడి కాయలు, పూలు, పండ్లు కొనుగోలు చేస్తూ ప్రజలు బిజీబిజీగా గడిపారు. ముఖ్యంగా పాతవూరు జనసంద్రాన్ని తలపించింది. విపరీతమైన ట్రాఫిక్‌తో పాతవూరు మార్కెట్ నుంచి బయట పడటానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

హ్యాపీ సంక్రాంతి

ప్రజలకు మంత్రి కేశవ్ పండుగ శుభాకాంక్షలు



అనంతపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను ప్రతిఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. తెలుగు ప్రజలకు ఎంతో ముఖ్యమైన సంక్రాంతి పండుగ ను మూడు రోజుల పాటు ఆనందంగా జరుపుకోవాలన్నారు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారన్నారు. మకర సంక్రమణము నుంచే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుందన్నారు. ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారన్నారు. సంక్రాంతి పండుగలో భాగంగా మొదటి రోజు భోగి మంటలు, రెండో రోజు పొంగలి, పిండివంటలు, పితృదేవతలు, దేవుళ్ల పూజలు, మూడో రోజు గోపూజ నిర్వహిస్తారన్నారు. ప్రజలందరికి సుఖ సంతోషాలు, భోగభాగ్యాలు, ఆనందోత్సాహాలు కలగాలని అభిలషించారు. ఈ సందర్భంగా అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఓపీకకు హద్దులేదు!

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మందులు ఇచ్చుకేంద్రం



ఆరేళ్లయినా ఓపీలేని వైనం



జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఈస్టోర్ నుంచే సూపర్‌స్పెషాలిటీకి మందులు తరలించేది

- ఒక్కో విభాగానికి వారంలో రెండు రోజులే వైద్యం
- మందుల కోసం జిల్లా ఆస్పత్రికి రావాల్సిందే
- ఇబ్బంది పడుతున్న ఫార్మసిస్టులు
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై దృష్టి సారించని పాలకులు



సూపర్‌స్పెషాలిటీ కాంపౌండుకు అనుకొని ఉన్న డ్రగ్స్ సరఫరా చేసే గోడౌన్

జిల్లా కేంద్రంలో ఎంతో గొప్పగా నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదన్న ఆరోపణలు రోగుల నుంచి వినిపిస్తున్నాయి. ఆరేళ్ల కిందట రూ.130కోట్ల వ్యయంతో ఈ ఆస్పత్రిని నిర్మించారు. ఎంతో కీలకమైన, ఖర్చుతో కూడుకున్న కార్డియాలజీ, న్యూరో, న్యూరాలజీ, న్యూరోసర్జన్, యూరాలజీ సేవలు ఇక్కడ అందిస్తున్నారు. అయితే వీటిలో ఒక్కో సేవ వారంలో రెండు రోజులు మాత్రమే అందుతోంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి నిర్మించి ఆరేళ్లు గడిచినా నేటికీ ఓపీ సేవలు అందుబాటులోకి రాలేదని పలువురు రోగులు చెబుతున్నారు. రోగులకు ఎంత సీరియస్‌గా ఉన్నా వారంలో ఆ విభాగానికి కేటాయించిన రోజు మాత్రమే ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తారు. ఇక్కడ క్యాజువాలిటీ వైద్యసేవలు అసలు లేవు. సీరియస్ కేసులు వచ్చినా తొలుత జిల్లా ఆస్పత్రికి వెళ్లి, అక్కడ నుంచి ఇక్కడకు రెఫర్ పేరుతో రావాల్సిందే. దీంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 24గంటల వైద్యసేవలు అందడం లేదు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఆస్పత్రితీరు మాత్రం మారడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

- అనంతపురం టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి)



మందుల సరఫరాలో విచిత్రం

సూపర్‌స్పెషాలిటీలో కీలకమైన వైద్య విభాగాలు నిర్వహిస్తుండటంతో వాటికి అవసరమైన మందులు రావాల్సి ఉంది. దాదాపు రెండు వందల రకాల మందులు ఇక్కడకు వచ్చే రోగులకు అవసరం ఉంటుందని ఫార్మసిస్టులు చెబుతున్నారు. అయితే ఈ ఆస్పత్రికి మందులు కావాలంటే జిల్లా ఆస్పత్రికి ఇండెంట్ పెట్టుకోవాల్సి ఉంటుంది. అక్కడ నుంచి డ్రగ్స్‌శాఖకు పంపితే డ్రగ్స్‌శాఖ నుంచి మందులు జిల్లా ఆస్పత్రికి సరఫరా చేస్తారు. అప్పుడు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఫార్మసిస్టులు జిల్లా ఆస్పత్రి ఆవరణంలో ఉన్న స్టోర్‌కు వచ్చి మందులు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే ఇక్కడే విచిత్రం కనిపిస్తుంది. సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి కాంపౌండుకు ఆనుకొనే జిల్లా మందుల గోడౌన్ ఉంది. ఆస్పత్రిలో నుంచి కేక వేస్తే డ్రగ్స్‌వాళ్లకు వినిపిస్తాయి. నాలుగు అడుగులువేస్తే డ్రగ్స్ తీసుకొని పోవడానికి అవకాశం ఉంది. కానీ డ్రగ్స్ గోడౌన్ నుంచి జిల్లా సర్వజన ఆస్పత్రికి, అక్కడి నుంచి మళ్లీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి మందులు తీసుకెళ్లాల్సి ఉంది. ఇదంతా అనవసరపు వ్యయప్రయాసలతో కూడుకున్న పని అని సిబ్బంది చెబుతున్నారు. కాగా ఇదే డ్రగ్స్ గోడౌన్ నుంచి నియోజకవర్గాలు, మండల స్థాయిలో ఉన్న సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు నేరుగా మందులు సరఫరా చేస్తున్నారు. అయితే అనంతకే తలమానికంగా ఉంటున్న సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి అది కూడా డ్రగ్స్ గోడౌన్‌కు సమీపంలో ఉన్నా మందుల కోసం సిబ్బంది ఊరంతా తిరగాల్సి వస్తోంది. ఆస్పత్రిలో ఉండే ఇద్దరు రెగ్యులర్ ఫార్మసిస్టులు, మరో ఇద్దరు కాంట్రాక్ట్ ఫార్మసిస్టులు నిత్యం ఏవోరకం మందులు తీసుకురావడానికి జిల్లా ఆస్పత్రికి తిరుగుతూనే ఉంటారు. ఈనేపథ్యంలో ఒక్కోసారి రోగులకు సమయానికి అవసరమైన మందులు ఇవ్వలేకపోతున్నారు. దీంతో సీరియస్ కేసులకు ఇబ్బంది కలుగుతున్నట్లు కూడా చెబుతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నెలకొన్న ఓపీ, మందుల సమస్యను పరిష్కరించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



ఆస్పత్రిలోనే మందులు ఇచ్చేలా చూస్తాం

సూపర్‌స్పెషాలిటీకి అవసరమైన మందుల ఇండెంట్ ప్రతినెలా మాకు పంపితే జిల్లా ఆస్పత్రి ద్వారా అక్కడికే పంపుతున్నాం. డ్రగ్స్ గోడౌన్ నుంచి నేరుగా జిల్లా ఆస్పత్రికి మందులు సరఫరా చేయడం, ఇక్కడకు వచ్చిన తర్వాత మందులను సూపర్‌స్పెషాలిటీకి తీసుకుపోతున్న విషయం వాస్తవమే. ఇది నిబంధనల ప్రకారమే జరుగుతోంది. ప్రస్తుతం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. సూపర్ స్పెషాలిటీ సమీపంలోనే డ్రగ్స్ గోడౌన్ ఉంది. అందుకే మందులను నేరుగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి సరఫరా చేసేలా చూస్తాం. ఈ విషయం ఉన్నతాధికారులతో చర్చించి ఆమేరకు నిర్ణయం తీసుకుంటాం.



- డాక్టరు వెంకటేశ్వరరావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

5 బెంగతీర్చిన బెండ
దిగుబడి, ధర బాగుండటంతో రైతుల ఆనందం



నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న జీప్లస్4

గుత్తి మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. వైసీపీ హయాంలో రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు మిన్నకుండిపోయారు. ఇప్పుడు కూడా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. మున్సిపాలిటీకి నామ మాత్రంగా ఫీజు చెల్లించి.. కమర్షియల్ భవనాలను నిరిస్తున్నారు. గ్రేడ్-సి మున్సిపాలిటీ అయిన గుత్తిలో జీ ప్లస్-2 నిర్మాణాలకు మాత్రమే అనుమతి ఇచ్చే అధికారం స్థానిక అధికారులకు ఉంటుంది. అంతకు మించి నిర్మించాలంటే అహుడాకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. కానీ అహుడా అనుమతి లేకుండా జీ ప్లస్-3, 4 , 5 నిర్మాణాలు చేపట్టినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. - ఆంధ్రజ్యోతి, గుత్తి




అనంతపురం రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న గృహం

ఇంటింటి బాగోతం..!

నివాసానికి అనుమతులు

వాణిజ్య అవసరాలకు నిర్మాణం

గుత్తిలో భారీగా అక్రమ కట్టడాలు




కాంప్లెక్స్ నిర్మాణం

అనంతపురం రోడ్డు, తాడిపత్రి రోడ్డు, గుత్తి ఆర్ఎస్, పత్తికొండ రోడ్డులో యథేచ్ఛగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరుగుతోంది.

• ఇంటి పేరిట అనుమతి

అనంతపురం రోడ్డులో ఓ హోటల్ నిర్వాహకుడు జీ ప్లస్-2 గృహానికి పట్టణ ప్రణాళిక అధికారులతో అనుమతి తీసుకుని, షాపింగ్ మాల్ నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక షోరూం ఏర్పాటు చేశారు. రెండు, మూడు ఫ్లోర్‌లలో లాడ్జి నిర్వహిస్తున్నారు. లిఫ్ట్ ఏర్పాటు చేసి, అదనంగా మరో అంతస్తు నిర్మించారు. మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు.



నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

• పన్ను ఎగవేత..

గృహ నిర్మాణాలకు చదరపు మీటరుకు రూ.5 వేలకు పైగా మున్సిపాలిటీకి రుసుము చెల్లించాలి. అదే కమర్షియల్ నిర్మాణాలకైతే రుసుము రెట్టింపు ఉంటుంది. అనుమతి ఇళ్లకు తీసుకుని, నిర్మాణాలు వాణిజ్య అవసరాలకు చేపడుతున్నారు. రాజీవ్ సర్కిల్‌లో ఇలాంటి భవంతినే నిర్మించారు. భారత్ గ్యాస్ గోదాము సమీపంలో ఓ ఉన్నతాధికారి నిబంధనలకు విరుద్ధంగా జీ ప్లస్-4 నిర్మాణం చేపట్టారు. ఓ ప్రముఖ హోటల్ పక్కన జీ ప్లస్-2 ఇంటి నిర్మాణానికి అనుమతి పొంది, బహుళ అంతస్తుల భవంతిని నిర్మిస్తున్నారు. గుత్తి ఆర్ఎస్‌లో రోడ్డు నిర్మాణ సమయంలో ఓ వ్యక్తి అయిదు అడుగులు రోడ్డుకు రాసిచ్చారు. కానీ ఇప్పటికీ అక్కడ ఆక్రమణలను తొలగించలేదు.

•అధికారుల సహకారం..?

నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవంతుల విషయంలో అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. పరోక్షంగా అక్రమాలకు సహకరిస్తున్నారు. కోర్టులో కేసు ఫైల్ చేస్తున్నామని చెబుతున్నారేగాని, క్షేత్ర స్థాయిలో నిర్మాణ పనులను అడ్డుకోవడంలేదు. అధికారుల నిర్వాకం కారణంగా మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడుతోంది. ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకుని, వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని పట్టణ ప్రణాళిక విభాగం అధికారి మారుతి ప్రసాద్ అన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

షట్టర్లు అమర్చేదెన్నడో..?

తొలగించి కంపచెట్లలో వేయడంతో తుప్పు పట్టిన షట్టర్లు



కాలువకు రాళ్లు అడ్డంగా వేసింది ఇక్కడే



- లైనింగ్ పనుల కోసం ఏళ్ల కిందట తొలగింపు
- పనులు పూర్తయినా మళ్లీ అమర్చని వైనం
- సాగునీరందక ఆయకట్టు రైతుల ఇబ్బందులు

గార్లదిన్నె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎంపీఆర్ దక్షిణ కాలువ డిస్ట్రిబ్యూటరీల వద్ద తొలగించిన షెట్టర్లను మళ్లీ అమర్చడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేయడంతో చివరి ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఎంపీఆర్ డ్యాం దక్షిణ కాలువకు డ్యాం నుంచి నార్పల వరకు సుమారు 28 డిస్ట్రిబ్యూటరీలున్నాయి. దాదాపు పదేళ్ల కిందట కాలువకు లైనింగ్ వేసే సమయంలో డిస్ట్రిబ్యూటరీల వద్ద ఉన్న షట్టర్లను అక్కడక్కడ తొలగించి పనులు పూర్తి చేశారు. అయితే ఏళ్లు గడుస్తున్నా నేటికి తొలగించిన షట్టర్లు మళ్లీ ఏర్పాటు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తొలగించిన షట్టర్లు పూర్తిగా తుప్పు పట్టాయి. గత వైసీపీ పాలనలో కాలువ మరమ్మతులను అసలు పట్టించుకోలేదు. డ్యాం గేట్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో డ్యాంలోని నీరంతా వృథాగా పెన్నానది పాలైంది. దీంతో సాగునీరందక ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి. కూటమి ప్రభుత్వమైనా యుద్ధ ప్రాతిపదికన తొలగించిన షట్టర్లు మళ్లీ ఏర్పాటు చేసి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

తొలగించారు.. వదిలేశారు



8వ డిస్ట్రిబ్యూటరీ కింద మర్తాడు, గార్లదిన్నె, తిమ్మంపేట, జంబులదిన్నె, మదిరేపల్లి, లోలూరు, ఆకులేడు తదితర గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాలు ఆయకట్టు ఉంది. షట్టర్లు తొలగించడంతో కాలువకు సాగునీరు విడుదల చేసినప్పుడు డిస్ట్రిబ్యూటరీలకు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ఆయకట్టు భూములు బీడుగా మారుతున్నాయి. ఆయకట్టుకు సాగునీరు రావాలంటే హెచ్చెల్సీలో అడ్డంగా రాళ్లు వేసుకుని తీసుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

- రైతు చెన్నారెడ్డి, జంబులదిన్నె

చిన్నచూపు తగదు



చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రతి నాయకుడు చెప్పే మాటలే. హెచ్చెల్సీ లైనింగ్ ఏర్పాటు సమయంలో తొలగించిన షట్టర్లు ఏర్పాటు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారు. షట్టర్లు నిర్మించకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. లైనింగ్ వేసి ఏళ్లు గడుస్తున్న షట్టర్లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి షట్టర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. లేని పక్షంలో పెద్దఎత్తున రైతులతో కలిసి ఉద్యమిస్తాం.

-రాము, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

నివేదికలు తయారు చేస్తున్నాం : రమణారెడ్డి, ఈఈ, హెచ్చెల్సీ

హెచ్చెల్సీకి లైనింగ్ ఏర్పాటు సమయంలో డిస్ట్రిబ్యూటరీల వద్ద ఉన్న షట్టర్లను తొలగించిన విషయం వాస్తవమే. షట్టర్ల ఏర్పాటుతో పాటు దక్షిణ కాలువకు ఉన్న 28 డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులకు చర్యలు చేపడుతున్నాం. త్వరలోనే షట్టర్లు ఏర్పాటు చేసి చివరి ఆయకట్టుకు సాగునీరు అందేలా కృషి చేస్తాం. వీటికి ఖర్చు అయ్యే నిధులకు నివేదికలు తయారు చేస్తున్నాం. నిధులు మంజురు అయిన వెంటనే షట్టర్లు, డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులు చేసి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తాం.

పోలీసు గ్రీవెన్స్ రద్దు

అనంతపురం క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పోలీస్ గ్రీవెన్స్)ను సోమవారం రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భోగి పండుగలో భాగంగా సెలవు రోజు కావడంతో రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుంచి రావొద్దని సూచించారు.

అంతా... రాయచూరే..!

- కర్ణాటకకు తరలుతున్న కంది దిగుబడి
- ఐదారుగురు కలిసి లోడెత్తుతున్న వైనం
- స్థానికంగా గిట్టుబాటు కాకపోవడమే కారణం
- ప్రైవేటు వ్యాపారులకు జడుస్తున్న రైతులు
- పక్క రాష్ట్ర మార్కెట్టే లాభదాయకం: అన్నదాతలు



5

ఊరి బడికి ఊపిరి..!

- ప్రాథమిక పాఠశాలలకు పూర్వవైభవం
- జీవో 117 రద్దుకు విద్యాశాఖ శ్రీకారం
- పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్
- రెండు నెలలపాటు క్షేత్రస్థాయిలో అధ్యయనం



5

ఊరి బడికి ఊపిరి..!

ప్రాథమిక పాఠశాలలకు పూర్వవైభవం

జీవో 117 రద్దుకు విద్యాశాఖ శ్రీకారం

పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్

రెండు నెలలపాటు క్షేత్రస్థాయిలో అధ్యయనం



జగన్ ప్రభుత్వంలో 117 జీవో రద్దు కోసం మాయదార్లపల్లిలో పాఠశాల గేటుకు కంపలుకొట్టి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు, విద్యార్థులు (ఫైల్)

అనంతపురం విద్య, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్కూళ్లను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఈక్రమంలోనే ప్రైమరీ స్కూళ్ల పాలిట శాపంగా మారిన జీవో 117 రద్దుకు శ్రీకారం చుట్టింది. దాన్ని రద్దు చేసేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. గత ప్రభుత్వం ఊరి బడికి 117 జీవో ద్వారా ఉరి వేయడంతో విద్యార్థులు విలవిలలాడారు. ఈ జీఓ ద్వారా 3,4,5 తరగతులను విలీనం పేరుతో ఊరికి దూరంగా ఉన్న స్కూళ్లకు తరలించారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు, వందలాది మంది టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లు మాన్పించారు. ఫలితంగా ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు తగ్గాయి. ఇదే క్రమంలో ప్రైవేట్ స్కూళ్లలో గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెరిగింది. జీవో 117ను మెజార్టీ టీచర్లు, సంఘాలు వ్యతిరేకించాయి. అయినా నాటి జగన్ ప్రభుత్వం ముందుకెళ్లింది.

వివాదాస్పద జీవోపై జిల్లాలో పెద్దఎత్తున ఉద్యమం

గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన జీవో 117 పై అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. తమ పిల్లలు చదువుకునే ఊరి బడిని విలీనం పేరుతో చీల్చడంతో చాలా గ్రామాల్లో ప్రజలు నిరసనలకు దిగారు. కుందుర్పి మండలం మాయదార్లపల్లిలో గ్రామస్థులు, విద్యార్థులు, స్కూల్ గేటుకు కంపలు వేసి నిరసన తెలిపారు. 72 రోజులపాటు ఆందోళన కొనసాగించారు. దీంతో బసాపురం హైస్కూల్‌లో విలీనం చేసిన మాయదార్లపల్లి స్కూల్‌లోని 6,7,8 తరగతుల విషయంలో అధికారులు వెనక్కు తగ్గారు. యథావిధిగా అక్కడే కొనసాగేలా జిల్లా విద్యా శాఖాధికారులు ఉత్తర్వులిచ్చారు. ఇలా పదుల సంఖ్యల్లో గ్రామాల్లో ఇవే నిరసన లు వెల్లువెత్తాయి. అయినా అప్పటి ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లడంతో జిల్లాలో సుమారు లక్ష మంది వరకూ విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఊరిలో ఉండే బడి నుంచి దూరంగా ఉండే స్కూళ్లకు వెళ్లాల్సి వచ్చింది. ఈ ఇబ్బందుల వల్లే టీచర్లు, సంఘాల నేతలు పెద్దఎత్తున ఆ జీవోను వ్యతిరేకించారు.

పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్

కూటమి ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలు, గత ప్రభుత్వ నిరంకుశ విధానాల దిద్దుబాటుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా జీవో 117 రద్దు చేసేందుకు సిద్ధమైంది. కొత్తగా మార్పులు తీసుకురానున్నట్లు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈక్రమంలోనే ప్రతి పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నారు. రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయనున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల డీఈఓలకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈనెల 20 నుంచి కమిషనర్ సైతం జిల్లాల పర్యటనకు వస్తున్నారు. ఈనెల 24న అనంతపురం జిల్లాలో పర్యటించే అవకాశం ఉంది.

నాణ్యమైన విద్యకు ఊతం



ఒకటి నుంచి ఐదో తరగతి స్కూళ్లకు పూర్వ వైభవం రానుంది. ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాలకు నాణ్యమైన విద్య చేరువకానుంది. గ్రామాల్లో విద్యార్థుల ఎన్‌రోల్ మెంట్ కూడా పెరుగుతుంది. మోడల్ ప్రైమరీ స్కూళ్ల ద్వారా ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతుంది. తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఉంచడం ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్కూళ్లలో మరింత అవకాశం వస్తుంది.

-కరణం హరికృష్ణ, ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు

మోడల్ ప్రైమరీతో జీవం



ప్రభుత్వం 117 జీవోను రద్దు చేయడంతో ప్రాథమిక విద్యావ్యవస్థకు జీవం పోసినట్లైంది. కూటమి ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ఒక క్లాస్‌కు ఒక టీచర్‌ను ఇవ్వనుండటంతో పాఠశాలలు బలోపేతం అవుతాయి. జీవో రద్దు వల్ల అనేక మంది నిరుద్యోగులకు సైతం భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు కలుగుతాయి.

-వెంకటరత్నం, జిల్లా ప్రధానకార్యదర్శి, ఆప్టా

అణచివేయాలని చూసినా..



గత ప్రభుత్వం జీవో 117 తీసుకురావడంతో ప్రాథమిక స్కూల్ వ్యవస్థ నిర్వీర్యమైంది. నాడు-నేడు కింద స్కూళ్ల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి విలీనం పేరుతో 3,4,5 తరగతులను తరలించారు. దీంతో దూరంగా ఉండే స్కూళ్లకు కాలినడకన వెళ్లలేక... విద్యార్థులు బడి మానేశారు. గ్రామస్థులు, ప్రజలు, విద్యార్థులు నిరసనకు దిగితే ప్రభుత్వం నిరంకుశ పద్ధతుల్లో అణచివేయాల్సి చూసింది. కూటమి ప్రభుత్వం రద్దు చేయడం ఆనందంగా ఉంది.

-విజయభాస్కర్, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీఎస్‌ఈఏ

అదనపు సెక్షన్ ఇవ్వాలి



కొత్త ప్రభుత్వం జీవో 117 రద్దు చేయడం మంచిదే. దీని వల్ల ప్రాథమిక స్కూళ్లు మళ్లీ జీవం పోసుకుంటాయి. అయితే ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల సంఖ్య తగ్గే అవకాశాలున్నాయి. దీనిపై మరింతగా అధ్యయనం చేసి...ఆ సమస్య రాకుండా చూడాలి. అదేవిధంగా హైస్కూళ్లలో సమాంతర మాధ్యమాన్ని అమలు చేయాలి. హైస్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 35 దాటితే అదనపు సెక్షన్ మంజూరు చేయాలి.

- రమణారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి, ఎస్టీయూ

మెర్జింగ్ వల్ల ఏకోపాధ్యాయ స్కూళ్లు



గతంలో క్లాసులను విలీనం చేయడం వల్ల చాలా ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలాయి. కొన్ని స్కూళ్లు మూతపడ్డాయి. ముఖ్యంగా 3,4,5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడంతో స్కూల్ అసిస్టెంట్లపై పనిభారం పెరిగింది. ఇంకో వైపు ప్రైమరీ పిల్లలు హైస్కూళ్లలో ఇమడలేక ఇబ్బందులు పడ్డారు. 117 రద్దుతో ఈ సమస్యలకు ఫుల్‌స్టాప్ పడుతుంది. ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల హాజరు పెరిగి మరింత బలపడతాయి.

-శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీఎస్టీఏ

డ్రాపౌట్స్ సంఖ్య తగ్గుతుంది



ఒక కిలోమీటరు దూరంలోని హైస్కూళ్లలో 3,4,5 తరగతులను విలీనం చేయడంతో విద్యార్థులు నడిచి వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ జీవో రద్దుతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్‌ల సంఖ్య తగ్గుతుంది. విద్యార్థులకు అందుబాటులో పాఠశాలల ఉండటం వల్ల నిత్యం విద్యార్థులు స్కూల్‌కు వస్తారు, పిల్లల హాజరుశాతం కూడా పెరుగుతుంది. విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

- గోవిందరాజులు, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్

రెండు మాధ్యమాలు కొనసాగించాలి



జీవో 117 రద్దు చేయనుండటం నిజంగా మంచి నిర్ణయం. దీని వల్ల ప్రైమరీ స్కూళ్లకు పూర్వ వైభవం వస్తుంది. యూపీ స్కూళ్లను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేయాలి. ప్రతి పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలను కొనసాగించాలి. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయాలి. దీని వల్ల ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థులకు న్యాయం జరుగుతుంది.

- రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆర్‌యూజేపీ

అంతా...రాయచూరే..!



కంది పంటను కోస్తున్న యంత్రం

- కర్ణాటకకు తరలుతున్న కంది దిగుబడి
- ఐదారుగురు కలిసి లోడెత్తుతున్న వైనం
- స్థానికంగా గిట్టుబాటు కాకపోవడమే కారణం
- ప్రైవేటు వ్యాపారులకు జడుస్తున్న రైతులు
- పక్క రాష్ట్ర మార్కెట్టే లాభదాయకం: అన్నదాతలు

విడపనకల్లు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానికంగా గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు వేల టన్నుల కంది పంటను కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. గత నాలుగేళ్లుగా పప్పుశనగ సాగు చేసి నష్టపోయిన ఉరవకొండ నియోజకవర్గ రైతులు ఈ సారి పంట మార్పిడిలో భాగంగా 80వేల ఎకరాలకు పైగా కంది పంటను సాగు చేశారు. అయితే పంట చేతికి వచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేకపోవటంతో రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. పంటను సాగు చేసిన రోజు నుంచి పురుగు మందులు, ఎరువులు, కోతల వరకూ దాదాపుగా ఎకరాకు రూ. 10వేలు పైనే పెట్టుబడి పెట్టినట్లు రైతులు పేర్కొ న్నారు. 'ఈ సారి మంచి ధరలు ఉంటాయి. ఎంతో కొంత అప్పు తీర్చుకోవచ్చు అని' రైతులు అనుకునే సమయానికి కంది కొనేవారే లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన కంది పంటను స్థానిక వ్యాపారులకే ఇద్దామంటే వారు కళ్ల ముందే మోసం చేస్తున్నారు. బాదు తీసే పేరుతో 50 కేజీల బస్తాకు 3కేజీలు అదనంగా తీసుకుంటున్నారు. ఒక క్వింటాకు దాదాపుగా ఆరు కిలోల బాదు తీస్తారు. కందులను గ్రేడింగ్ చేసినా హామాలీ చార్జీలు, కాటా చార్జీ అంటూ, సరుకు బాగున్నా ఏదో ఒక పేరు పెట్టి బాదు పేరుతో దోచేస్తున్నారు. దీనికి తోడు రేటు కూడా అంతంతమాత్రమే ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. అందుకే రైతులు వేల క్వింటాళ్ల కందులను కర్ణాటకకు తరలిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ మార్కెట్‌లో రైతులను వ్యాపారులు గౌరవిస్తు, బాదు కూడా క్వింటాకు అర కిలో, లేదా కిలో మాత్రమే తీసుకుంటున్నారు. అలాగే తూకాలు పూర్తి కాగానే లెక్కగట్టి నగదు ఇచ్చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇక్కడి కంటే కర్ణాటకలో ధరలు కూడా బాగా ఉంటున్నాయని, అందుకే పంట దిగుబడిని అక్కడికే తరలిస్తున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు. గ్రామంలోని ఐదారుగురు రైతులు కలిసి ఓ లారీని అద్దెకు మాట్లాడుకుని, రాత్రికి లోడ్ చేసుకుని తెల్లారేసరికి మార్కెట్‌కు చేరుకుని విక్రయిస్తున్నారు.



పొలాల్లోనే కందులను రాసులుగా పోసుకున్న రైతులు

గ్రేడింగ్‌ను బట్టి ధర

రాయచూర్ మార్కెట్‌లో కందుల ధరను గ్రేడింగ్‌ను బట్టి నిర్ణయిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. కందుల్లో 15శాతం తేమ ఉన్నా రూ. 8వేల నుంచి రూ.10వేల వరకూ ధరలు ఉంటాయి. అదే 20శాతం తేమ ఉంటే రూ. 6500 నుంచి రూ.7500 వరకూ ఉంటాయని పలువురు రైతులు చెబుతున్నారు. తేమశాతం అసలు లేని కందులను మార్కెట్ రేటు కంటే ఎక్కువ ధరలకు కొనుగోలు చేస్తారని, రాయచూర్ మార్కెట్ వెళ్లిన రైతులకు నష్టం అంటూ ఏమి ఉండదు అని పలువురు రైతులు చెబుతున్నారు. బళ్లారి మార్కెట్‌లోను మంచి ధరలు ఉన్నాయని, అయినా రైతులు అందరూ రాయచూర్ మార్కెట్ వైపే మొగ్గుచూపుతున్నారు. అయితే మన రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 15 శాతం తేమ ఉన్నా కందులను తీసుకోరు. అసలు ప్రభుత్వ కంది కొనుగోలు కేంద్రాలు ఎక్కడున్నాయో కూడా తమకు తెలియదని రైతులు పేర్కొంటున్నారు. ఈ కేంద్రాల్లో ధర కూడా రూ.7550 మాత్రమే. ఇక బయట వ్యాపారులు కూడా కందులు చాలా బాగా ఉంటే రూ.8 వేలదాక ధర పెడతారని, అందుకే ఇక్కడి కంటే కర్ణాటకే మేలని రైతులు చెబుతున్నారు.



కందులను మిషన్‌కు వేసి గ్రేడింగ్ చేస్తున్న రైతులు

సరైన ధర ఏదీ..?: మహేష్‌బాబు, పెద్దకొట్టాలపల్లి



నేను 50 ఎకరాల్లో కంది సాగు చేశా. ఓ పది ఎకరాలు వరకూ జింకలు తిని పాడై పోయింది. మిగిలిన 40 ఎకరాల్లో కంది పంటను కోయించా. ఎకరాకు దాదాపు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అయితే ఇక్కడ కందులకు సరైన ధర లేదు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 7550 అంటే రైతులకు గిట్టుబాటు కాదు. కనీసం రూ. 9వేలకు పైగా ఉంటేనే అంతో ఇంతో గిట్టుబాటు అవుతుంది. అందుకే రాయచూర్ మార్కెట్‌కు కందులను తరలించేందుకు సిద్ధం చేసుకుంటున్నా. అక్కడ ధర బాగానే ఇస్తున్నారు. తేమశాతం లేని కందులకు దాదాపుగా రూ. 10వేలు పైగానే ఇస్తున్నారు.

ఇక్కడి వ్యాపారులకు ఇవ్వాలంటే భయం: రామకృష్ణ, మాళాపురం



పదెకరాల్లో కంది పంట సాగు చేశా. ఇక్కడ వ్యాపారులకు కందులను విక్రయించాలంటే భయంగా ఉంది. తూకాల్లోనే రైతులను మోసం చేసి క్వింటాకు 10 నుంచి 12 కేజీలు కాజేస్తున్నారు. ప్రభుత్వం కూడా సరైన మద్దతు ధర ఇవ్వలేదు. క్వింటా రూ. 7550అంటే మాకు ఏమి గిట్టదు. అందుకే ఏమి చేయాలో తెలియక కందులను పొలాల్లోనే ఆరబెట్టుకున్నాం. ప్రభుత్వం బయటి మార్కెట్ కంటే ఓ 500 ఎక్కువ ఇస్తే పక్క రాష్ట్రాలకు వెళ్లే పని ఉండదు.

రాయచూర్‌కు తీసుకెళ్తా: భుజంగం, మాళాపురం



నేను ఐదెకరాల్లో కంది పంట సాగు చేశా. దాదాపు ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కానీ ధరలు సరిగ్గా లేవు. ప్రభుత్వం క్వింటాకు ఏడు వేలు అంటోంది. బయట మార్కెట్‌లో ఎనిమిది వేలు మాత్రమే ఉంది. అదే కర్ణాటక రాష్ట్రంలో ఎనిమిది వేలకు పైనే ధరలు ఉన్నాయి. రాయచూరుకు వెళ్లటం అనేది వ్యయ ప్రయాసలతో కూడిన పని. అయినా రూపాయి మిగలాలంటే ఎంత దూరం అయినా వెళ్లాల్సిందే. అందుకే ఓ వారం రోజులు చూసి దిగుబడిని రాయచూర్‌కు తీసుకెళ్తా.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

-ఇద్దరికి గాయాలు

నల్లచెరువు, జనవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడిన ఘటన చోటు చేసుకుంది. ఆదివారం ఎస్‌ఐ మగ్బూల్‌బాషా తెలిపిన మేరకు నల్లచెరువు నుంచి నల్లజోడువారిపల్లికి ట్రాక్టర్‌లో ముగ్గురు వ్యక్తులు బియ్యం మూటలు తీసుకుని శనివారం రాత్రి వెళుతుండగా కాయలవాండ్లపల్లి బస్‌స్టాప్ వద్ద మదనపల్లి నుంచి అదిలాబాద్ వెళ్తున్న ఐషర్ వాహనం ఢీకొని వెళ్లిపోయిందన్నారు. ప్రమాదంలో నల్లజోడువారిపల్లికి చెందిన రామచంద్ర(54) అక్కడిక్కడే మృతిచెందగా, నరసింహులు, గంగన్నకు గాయాలైనట్లు తెలిపారు. విషయాన్ని కదిరికి సమాచారం ఇవ్వడంతో ఐషర్ వాహనాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. గాయపడిన వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామచంద్రకు భార్య, ఇద్దరు పిల్లలున్నట్లు తెలిపారు.

టమోటా కిలో రూ.15

అనంతపురం రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 15తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 12, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

740 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 740 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 కు 446 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి

అనంతపురం క్రైం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీ కొనడంతో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి రూరల్ మండలంలోని కొడిమి సమీపంలో జరిగింది. అనంతపురం రూరల్ సీఐ శేఖర్ తెలిపిన మేరకు... రూరల్ మండలం నరసనాయనికుంటకు చెందిన రాజ్‌కుమార్‌నాయక్(18) అనంతపురం నగరంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ సెకెండియర్ చదువుతున్నాడు. తన సమీప బంధువులైన దామోదర్‌నాయక్, కార్తీక్ నాయక్‌తో కలిసి శనివారం రాత్రి గ్రామం నుంచి బైక్‌లో బయలుదేరారు. కొడిమి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను వారి బైక్ ఢీ కొంది. దీంతో ట్రాక్టర్ ముందు భాగంలోని బంపర్ తగిలి రాజ్‌కుమార్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్ అనుమానాస్పద మృతి



బోయ అంజి (ఫైల్)

బెళుగుప్ప, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరుపాపల్లికి చెందిన లారీ డ్రైవర్ (38) బోయ అంజి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. మృతుడి బంధువులు ఆదివారం పోలీసులకు తెలిపిన వివరాల మేరకు బోయ అంజి అనంతపురానికి చెందిన లారీకి డ్రైవర్‌గా వెళుతున్నాడు. కోయంబత్తూరు వద్ద రెండు రోజుల నుంచి ఆంధ్ర లారీ ఆగి ఉండటంతో అక్కడి పోలీసులు ఆరా తీశారు. డ్రైవర్ మృతదేహం ఒక కాలువలో ఉండటాన్ని గమనించారు. అక్కడ లభించిన వివరాల మేరకు విరుపాపల్లి గ్రామస్థులకు సమాచారం అందించారు. హత్య చేశారా? ఏదైనా ప్రమాదం జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెంగతీర్చిన బెండ

దిగుబడి, ధర బాగుండటంతో రైతుల ఆనందం



బెండ పంట

గుత్తిరూరల్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): బెండ పంట దిగుబడి, ధరలు ఆశాజనకంగా ఉండటంతో సాగుచేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ నీటితో సాగు చేసిన బెండ పంటకు మంచి గిట్టుబాటు ధర లభిస్తోంది. మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన గోపీనాథ్ చౌదరి ఒక ఎకరాలో డ్రిప్ ఆధారంగా బెండ పంటసాగు చేశాడు. సకాలంలో సస్యరక్షణ పద్ధతులు పాటించాడు. దీంతో మంచి దిగుబడి వచ్చింది. రేటు బాగుండటంతో లాభాల చూస్తున్నాడు. విత్తనాలు, సాగు, మందులకు రూ. 20 వేలు వెచ్చించాడు. వారానికి ఒకసారి మందులను పిచికారి చేశాడు. పంట సాగు చేసిన 45 రోజులకే దిగుబడి రావడం ప్రారంభమైంది. ప్రతి రోజూ 400 కిలోలకు పైగా మార్కెట్‌కు తరలిస్తున్నాడు. మార్కెట్‌లో కిలో రూ. 20 నుంచి రూ. 35లు పలుకుతోంది. మిగతా కూరగాయల ధరలు తగ్గినా బెండ రేటు మాత్రం మెరుగ్గానే ఉంది. ప్రస్తుతం 15 కోతలు కోసినట్లు తెలిపాడు. ఇప్పటి దాకా దాదాపు రూ.రెండు లక్షల ఆదాయం వచ్చనట్లు రైతు ఆనందం వ్యక్తం చేశాడు. ఇంక రెండు నెలల పాటు పంట కాస్తుందని, మంచి దిగుబడి వచ్చిన సమయంలో మంచి ధర లభించడం సంతోషంగా ఉందని రైతు ఆనందాన్ని వ్యక్తం చేశాడు.



యువరైతు గోపీనాథ్ చౌదరి

బాబు బంగారం

తైక్వాండోలో భవేష్‌కు పతకం



అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తైక్వాండో అండర్-10 పోటీలో జిల్లాకు చెందిన భవేష్ బంగారు పతకం సాధించాడు. బాపట్ల జిల్లా రేపల్లెలో ఆదివారం నిర్వహించిన ఏపీ రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్-2025 పోటీల్లో భవేష్ అద్భుతమైన ప్రదర్శన చేశాడు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో పది వరకు పతకాలు సాధించిన భవేష్ ఈ పోటీలో బంగారు పతకం సాధించడం పట్ల తల్లిదండ్రులు లక్ష్మీనరసప్ప, మమత, కోచ్ మనీంద్ర హర్షం వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

అనంతపురం రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగర శివారులోని శిల్పారామంలో మూడురోజుల పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ క్రిష్ణప్రసాద్ తెలిపారు. ప్రతి సాయంత్ర 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సోమవారం భోగి మంటలు, గంగిరెద్దుల ప్రదర్శన, మానస నృత్య కళా కేంద్రం వారి బృందంచే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. మంగళవారం ధర్మవరానికి చెందిన శ్రీలలిత నాట్య కళానికేతన్ ఆధ్వర్యంలో జానపద, కూచిపూడి నృత్యప్రదర్శలు ఉంటాయన్నారు. ఈ నెల 15న చిన్నారులతో గాలిపటాలు ఎగురవేయట, మైదుకూరుకు చెందిన శివకృష్ణ వారిచే ఇంద్రజాల ప్రదర్శనలుంటాయన్నారు. పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న బల్లా పల్లవి దంపతులు


శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న బల్లా సురేష్, బల్లా పల్లవి

అనంతపురం అర్బన్, జనవరి12(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచనల మేరకు బల్లా గ్రూప్ అధినేత బల్లా సురేష్, బల్లా పల్లవి దంప తులు రూ.లక్ష చొప్పున చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ చేతుల మీ దుగా వారు పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. వారిని జిల్లా అధ్యక్షుడు అభినందించారు. పేదలకు ఉచితంగా సభ్యత్వం చేయించేందుకు గతంలో రూ.లక్ష విరాళం ఇవ్వడంతో పాటు దంపతులు ఇద్దరు శాశ్వత సభ్యత్వ తీసుకోవడం గర్వకారణమన్నారు. టీడీపీ నాయకులు సరిపూటి రమణ, కురబ నారాయణస్వామి, షణ్ముఖ, లక్ష్మీనాయుడమ్మ, రాంబాబు, పవన్‌చౌదరి, పూలబాషా ఎన్‌బీకే నారాయణస్వామి, లోకేశ్, దినకర్ పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.4.28 లక్షలు

అనంతపురం రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ. 4,28,420 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,19,970, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.2,08,450 వచ్చిందని తెలిపారు.

రేపు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

గార్లదిన్నె, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతకల్లూరులో సంక్రాంతి పండుగను పురస్క రించు కుని మంగళవారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఏడాది గ్రామంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం అనవాయితీగా వస్తోందన్నారు. విజేతలకు మొదటి బహుమతిని లక్ష్మీవెంకటేశ్వర రైస్‌మిల్ యాజమాని రూ.8వేలు, రెండో బహుమతిని తడికెత్తుల నాగరాజు వీఆర్‌పీ రూ.5వేలు, మూడో బహుమతిని పుట్టు కల మల్లికార్జున, పిల్లల సింగరయ్య రూ.3వేలు, నాలుగో బహుమతిని కుమ్మర నరేష్ రూ.వెయ్యి అందజేస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఎంట్రీ పీజు రూ.300 చెల్లించి సోమవారం సాయంత్రం లోగా తమ జట్టుపేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 6302655150, 8688244768ను సంప్రదించాలన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే ఉపేక్షించం: సీఐ

గార్లదిన్నె, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు ఆడితే ఎంతటివారినైనా ఉపేంక్షించబోమని శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం ఆయన ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషాతో కలసి విలేకర్లతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాట్లాడారు. "జూదాలను అరికట్టేందుకు తమవంతు కృషి చేస్తున్నామ న్నారు. గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. పేకాట, కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసుల కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చి న వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

● రామగిరి: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి జూదాలు, కోడిపందేలు నిర్వహించరాదని ఎస్ఐ సుధాకర్‌యాదవ్ ఆదివారం హెచ్చరించారు. పండుగను సంప్రదాయంగా నిర్వహించుకోవాలన్నారు. ఎక్కడైనా జూదాలు నిర్వహిస్తే 100కి ఫోన్ చేయాలని ఎస్ఐ కోరారు.

అధిక సంఖ్యలో వినతులతో రండి

● ఎంఈఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్‌కు వినతులతో పోటెత్తాలని ఎంఈఎఫ్ నాయకులు పిలుపుచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎంఈఎఫ్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆ సంఘం జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ మాట్లాడుతూ... రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ సభ్యులు ఈ నెల 20 అనంతపురం వస్తారన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగ, ఉప కులాల ఉద్యోగులు, విద్యార్థులు, కార్యకర్తలు వినతులతో వచ్చి కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. అలాగే ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా రామన్న, సంయుక్త కార్య దర్శిగా వీరయ్య, గౌరవ సలహాదారులుగా కృష్ణమూర్తి, నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన ప్రక టించారు. జిల్లా అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

కంచికుంటలో తీరిన తాగునీటి సమస్య

రామగిరి, జనవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలో రామగిరి పంచాయతీలోని అతి కుగ్రామమైన కంచికుంటలో తాగునీటి సమస్య పూర్తిగా తీరింది. కంచికుంట గ్రామంలో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని ఆదివారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో తాగునీటి బోరు వేయించి, కొళాయిలు ఏర్పాటుచేయించారు. గతంలో ప్రభుత్వం వేయించిన తాగునీటి బోరు నుంచి నీరు సక్రమంగా రాక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం నీరు సమృద్ధిగా అందుతోంది. టీడీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మాజీ ఎంపీపీ పరంధామయాదవ్; మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, తెలుగుయువత శ్రీధర్‌నాయుడు, అప్పర్‌పెన్నార్ సాగునీటి సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు మాదాపురం శంకర, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, శివకుమార్, క్రాంతి, కంచికుంటదుర్గప్ప తదితరులు పాల్గొన్నారు.

దారంతా గుంతలే..!

● నాయక్‌నగర్ రైల్వే గేటు నుంచి జాతీయ రహదారి వరకూ అధ్వానంగా రోడ్డు
● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


గుంతలమయమైన రోడ్డు

రాప్తాడు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతంలో రైల్వే గేటు వద్ద నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు అధ్వానంగా మారింది. దారంతా గుంతల మయంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నాయక్‌నగర్ రైల్వే గేటు వద్ద నుంచి 44వ జాతీయ రహదారి వరకు దాదాపు 3 కి.మీ రోడ్డు గుంతల మయంగా ఉంది. ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్దకు రైలులో ప్రభుత్వం పేదలకు అందించే బియ్యం సరఫరా అవుతాయి. ఆ బియ్యాన్ని లారీల్లో రైల్వే స్టేషన్ నుంచి 44వ జాతీయ రహదారి మీదుగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తారు. బియ్యం వాహనాలు అధిక లోడుతో వెళ్లడంతో దారంతా దెబ్బతింది. అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. పెద్ద పెద్ద కంకర రాళ్లు తేలాయి. దీంతో వాహనదారులు ఆ దారి గుండా వెళ్లాలంటే జంకుతున్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో బియ్యం లారీలు రోడ్డుపై వెళ్లేటప్పుడు దుమ్ము, ధూళి చెలరేగుతోంది. రాప్తాడు నుంచి నాయక్‌నగర్ రైల్వే గేటు మీదుగా అనంతపురం నగరానికి ద్విచక్రవాహనదారులు అధికంగా వెళుతుంటారు. అయితే దారి సక్రమంగా లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఆ రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అవే ద్వారా నిజాయతీపరులకు అవార్డులు

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి


మాట్లాడుతున్న వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అవే సంస్థ ద్వారా నిజాయితీపరులైన ఉద్యోగులకు అవార్డులు ప్రధానం చేయనున్నట్లు అవే సంస్థ వ్యవస్థాపకులు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడా రు. సమాజంలో అవినీతి పెచ్చు మీరి, సామాజిక రుగ్మతగా తయారైన సమయంలో నిజాయితీగా పనిచేసే ఉద్యోగులను గౌరవించే సమాజం అవసరమన్నారు. అందులో భాగంగానే అవే సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6న హైదరాబాద్ రవీంద్ర భారతిలో 12 మంది నిజాయితీపరులైన ఉద్యోగులకు అవే సంస్థ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఆ ఉద్యోగులు అవార్డు తీసుకునేందుకు రానుపోను చార్జీలు సంస్థనే భరిస్తుందన్నారు. కొన్నేళ్లుగా ఈ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. వివిధ రాష్ట్రాల్లో వేతనం మీద బతుకుతూ, నిజాయితీగా పనిచేస్తున్న ఉద్యోగు లను అనేక మార్గాల ద్వారా అన్వే షించి అవార్డులకు ఎంపిక చేస్తున్నా మన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో సామాజిక బాధ్యతగా మెలికే వ్యక్తులను ఆహ్వానిస్తున్నా మన్నారు. త్వరలో కార్యక్రమానికి సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ప్రక టిస్తామన్నారు. నిజాయితీ పరులను వెలికి తీసి వారి ఔన్నత్యాన్ని, నిజాయితీని చాటి చెప్పినప్పుడు, వారిని చూసి స్ఫూర్తిగా తీసుకొని మరికొందరు ముందుకు వెళ్లే అవకాశం ఉందన్నారు. సమాజంలో అవినీతి, అక్రమాలు, అన్యాయం జరగకూడదని మనం అంటున్నామ ని, కానీ నీతిగా బతికే వ్యక్తులను మనం ఎంత మందిని గౌరవిస్తున్నామో ఒక సారి ప్రశ్నించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజహితం కోరే వ్యక్తులు ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. లంచం తీసుకోకుండా పనిచేసే ఉద్యోగుల వివరాలు తమకు అందజేస్తే వాటిపై పలు మార్గాల ద్వారా సమీక్ష చేసి అవార్డులకు ఎంపిక చేయనున్నట్లు వైకుంఠం ప్రభాకర్ చౌదరి తెలిపారు.

60 మందికి కృత్రిమ అవయవాలు వితరణ


వివేకానందుడికి నివాళులర్పిస్తున్న బృందం

అనంతపురం కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం క్లాక్‌టవర్ వద్ద వివేకానందుడి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాయికృష్ణ ఫంక్షన్‌హాల్‌లో 60 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులను పంపిణీ చేశారు. భారత్‌వికాస్ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ పరుచూరు రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి న్యాయవాది ఆలూరు రా ఘవేంద్ర ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం పరుచూరు రమేష్‌బాబు మాట్లాడుతూ... పరిషత్ ఆధ్వర్యంలో గత 19 సంవత్సరాలుగా నిర్విరామంగా సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు వితరణ చేశారు. న్యాయవాది నాగేశ్వరి, మధుసూదన్‌రెడ్డి, టీడీపీ నాయకుడు బాంబే డైయింగ్ నాగన్న, కోరాడ రామకృష్ణ, రమణానాయుడు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి చేయూతనిద్దాం


వివేకానంద, ఫాదర్ ఫెర్రర్, మీనాక్షమ్మ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం ప్రెస్‌క్లబ్/కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సమాజహితం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దేశాభివృద్ధిలో పాలుపంచుకొని తమవంతు చేయూత నందించాలని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాధవరెడ్డి, రవికాంత్ రమణ, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి పిలుపునిచ్చారు. నగరం లోని అనంత కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ప్రజాగాయకుడు ఎస్కే లెనిన్‌బాబు అధ్యక్షతన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. స్వామి వివేకానంద, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్, మీనాక్షమ్మ స్ఫూర్తితో స్వచ్ఛంద సంస్థలు పరస్పర సహకారంతో సమాజా నికి సేవ లందిద్దామని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థల ప్రతిని ధులు వికాస్, సురేష్ గుప్తా, డిస్కవర్ అనిల్, రచయిత్రి శశికళ, ప్రొఫె సర్ గంగిరెడ్డి, వదాన్య జన సొసైటీ పడపాటి అశోక్, అనంత నేచురల్స్ పార్థసారథి, ప్రకృతి వ్యవసాయ రైతు నాగరాజు, బద్దే నాయక్ పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల కమిటీ ఎంపిక

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నగర కమిటీ ఆదివారం ఎంపికైంది. జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప, జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో సమావేశమై నగర కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా క్రిష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా ఫక్రుల్లాఖాన్, కిరణ్, కార్యదర్శిగా జాఫర్‌వలి, సంయుక్త కార్యదర్శులుగా మాదర్ సాహెబ్, ఈశ్వరయ్య, కోశాధికారిగా బీవీ రమణను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతనంగా ఎంపికైన సభ్యులను ఘనంగా సన్మానించి నియామక పత్రాలను అందజేశారు.

ఉరుసు ఉత్సవం పోస్టర్ల విడుదల


ఉరుసు పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ప్రసిద్ధి చెందిన సాలార్ మసూద్ గాజీ ఉరుసు ఉత్సవం పోస్టర్లను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విడుదల చేశారు. శింగనమలంలో ఈ నెల 27, 28, 29 తేదీలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దర్గా మజావర్లు ఆదివారం సంబంధిత పోస్టర్లను నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చెతులమీదగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల ఆయకట్టు అధ్యక్షుడు గార్లదిన్నె సత్యనారాయణ మజావర్లు అబ్దుల్ ఖదీర్, అక్రం, హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి: ఎస్‌ఎఫ్‌ఐ

అనంతపురం కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రభుత్వంపై ఉద్య మించక తప్పదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ పేర్కొన్నారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశంలో పరమేష్ మాట్లాడారు. యువగళం పాదయాత్ర సందర్భంగా ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వసతి దీవెన, విద్యాదీవెన రూ.3,480కోట్లు పెండింగ్ పెట్టిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పండుగ సెలవులు ముగిసేలోగా బకాయిలు మొత్తం చెల్లించాలని కోరారు. అలాగే 2024-25 విద్యాసంవత్సరానికి తల్లికి వందనం అమలు చేయాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వైటీసీ రమేష్, తరిమెల గిరి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

అనంతపురం కల్చరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మూడో రోడ్డులోని షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద షిర్డీ సాయిబాబా సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగన లక్ష్మిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వైకుంఠం జయచంద్రచౌదరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. దాదాపు 70 మంది మహిళలు పోటీపడ్డారు. మాసినేని లక్ష్మీదేవి, తెలుగు ప్రొఫెసర్ యమునారాణి, అధ్యాపకులు జానకమ్మ, యశోదమ్మ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం పోటీల్లో నగరానికి చెందిన స్వాతికి మొదటి బహుమతిగా టీవీ, మహేశ్వరికి ద్వితీయ బహుమతి మిక్సీ, సోనియాకు తృతీయ బహుమతిగా ఎలక్ట్రిక్ కుక్కర్ అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్నవారందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు ప్రారంభం

అనంతపురం రూరల్, జనవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యేడు గ్రామంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. మూడు రోజుల పాటు క్రికెట్, కబడీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు లక్ష్మీనారాయణ, చెంద్రాయుడు, పెద్దగొర్ల సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, తాతిరెడ్డి ఎర్రిస్వామిరెడ్డి, దివాకర్‌రెడ్డి, బషీర్, నెట్టికంటి తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేతలు ఆర్డీటీ, డీఎస్‌ఏ జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతలుగా ఆర్డీటీ, డీఎస్‌ఏ జట్లు నిలిచాయి. వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక అశోక్‌నగర్ డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో వివేకానంద స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో విజేతగా ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్ జట్టు, ద్వితీయ స్థానంలో కేఎస్‌ఆర్ బాలికల జట్టు నిలిచాయి. బాలుర విభాగంలో విజేతగా డీఎస్‌ఏ వివేకానంద జట్టు, ద్వితీయ స్థానంలో జ ధర్మవరం ఆర్డీటీ జట్టు గెలుపొందాయి. అంతకు ముందు వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానంద స్ఫూర్తితో యువత అన్ని రంగాల్లో రాణించాలని అధికారులు సూచించారు. అనంతరం కస్టమ్స్ అధికారి ఐఆర్‌ఎస్ లోకనాథ్‌రెడ్డి, విద్యుత్తుశాఖ విజిలెన్స్ సీఐ విశ్వనాథ్‌చౌదరి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శాప్ కబడ్డీ కోచ్ అనీల్‌కుమార్, కోచ్ సంధ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, న్యాయవాది మురళీధర్, ఆర్డీటీ రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు, పీడీలు, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


బాలికల కబడ్డీ విజేత ఆర్డీటీ జట్టు


బాలుర విజేత డీఎస్‌ఏ వివేకానంద కబడ్డీ జట్టు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే భక్తుల ఇల వేల్పుగా విరాజిల్లుతున్న గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు వేకువ జామున స్వామివారికి వివిధ అభిషేకాలు చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామివారికి మొక్కులు నెరవేర్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయంలో భక్తుల భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

రేపు బాషావలి షా దర్గా ఉరుసు ఉత్సవాలు

అనంతపురరంరూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిమి గ్రామ శివారుల్లో వెలసిన హజరత్ ఖ్వాజా సయ్యద్ బాషావలి షా మహమ్మద్ ఖాసీం ఖాద్రీ ఉత్సవాలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు హసనత్ దర్గా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బనగానపల్లెకు చెందిన సద్గురు డాక్టర్ హజరత్ సయ్యద్ హుస్సేన్ బాద్ షా ఖాద్రి స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. మంగళవారం సాయంత్రం 5గంటలకు గంధం, ఉరుసు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, ఫకీర్ల జల్సాలు, ముస్లిం సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. దర్గాలో ప్రత్యేక దువా ప్రార్థనలు, అన్నదాన, ఇతర సేవా కార్యక్రమా లు ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు.

ఆదర్శప్రాయుడు న్యాయవాది తులసి రెడ్డి

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి

అనంతపురం క్రైం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): నేటి యువతకు ఆదర్శప్రాయుడు న్యాయవాది తులసిరెడ్డి అని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎస్కేయూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో తులసిరెడ్డి సంతాపసభ నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది బి నారాయణరెడ్డి, ఆలిండియా రేడియో అధికారి నాగేశ్వర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయశాస్త్రం విద్యార్థులకు తులసిరెడ్డి ఎంతో ప్రోత్సాహం అందించేవారన్నారు. ఆశ్రయం కల్పిస్తూ సీట్లు ఇప్పించే వారన్నారు. ఉన్నత విద్యతోనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్యార్థులకు నూరిపోసేవారన్నారు. ఆయన ప్రోత్సాహంతో చదువుకున్న అనేకమంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నతమైన పదువుల్లో ఉన్నారన్నారు. న్యాయశాస్త్రం అభ్యసించే రోజుల్లో తనకు కూడా సహకారం అందించారన్నారు. వివాహం కూడా చేసుకోకుండా పదిమందికి సాయం చేశారని గుర్తు చేశారు. ఇలాంటి వ్యక్తులు సమాజంలో చాలా అరుదుగా ఉంటారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ ముండ్ల వెంకటశివారెడ్డి మాట్లాడుతూ... సాయం పదానికి పర్యాయపదమే తులసిరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, తులసిరెడ్డి సోదరుడు గంగిరెడ్డి, హైకోర్టు న్యాయవాదులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానంద జయంతి


వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం క్లాక్‌టవర్/కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక అశోక్ నగర్‌లోని వివేకానంద పార్కులో ఉన్న వివేకానంద యోగా కేంద్రం ఆ ధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించారు. పార్కులో ఉన్న వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామూహిక భగవ ద్గీత పఠనం, యోగా పోటీలు నిర్వహించారు. విజేతలను మెమెం టోలతో సత్కరించారు. వేసవి సెలవుల్లో విజ్ఞాన యాత్రకు తీసుకెళ్తామ ని యోగాకేంద్రం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. హాజరైన టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు బుగ్గయ్య చౌదరి, ఆది నారాయణ మాట్లాడుతూ... వివేకానందుడి బోధనలు ఆచరణీయమని, సమాజంలోని ప్రతి విద్యార్థి వాటిని స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్లు బల్లా పల్లవి, సరిపూటి రమణ, హరిత, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్, యోగా కేంద్రం కార్యదర్శి హనుమంతరెడ్డి, కోఆర్డి నేటర్ మారుతి, సభ్యులు పుల్లయ్య, తారకరామయ్య, గురు రాజారావు, సుధాకర్‌మూర్తి, కృష్ణవేణి, సుశీల, కృష్ణ, నవోమి, నాయకులు జేఎం బాషా, రాంబాబు, సరిపూటి శ్రీకాంత్, ఎన్బీకే నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం క్లాక్‌టవర్: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రూడ్‌సెట్ కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీఎస్ఆర్ కార్మిక సంఘం మాజీ గౌరవాధ్యక్షుడు రమేష్, యువజన జాగృతి సొసైటీ అధ్యక్షుడు వెంకటేష్, రూడ్‌సెట్ రిసోర్స్ పర్సన్ ఉషారాణి, యంగ్ లీడర్ శ్రీవిద్య, సాయినాథ్, యువ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని కేంద్ర యువజన, క్రీడా శాఖ అనుబంధ ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం యువజన దినోత్సవం నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీలో యువత రక్తదానం చేశారు. ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి ప్రసిల్లా, సహాయ కార్యదర్శి షేక్ చాందిని, అలేఖ్య, ముత్యాలమ్మ, లావణ్య, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సభ్యులు నాగశివ, విశ్వనాథ్, మల్లికార్జున, కుమార్, ఆదిత్య, రిత్విక్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంప్రదాయ నృత్యం


దేవరకొండ కౌసల్య బృందాన్ని సత్కరిస్తున్న అవోపా నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఓం సంగీత నృత్య శిక్షణాలయం చిన్నారులు సంప్రదాయ నృత్యంతో సంక్రాంతి సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అవోపా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ కుటుంబ సమ్మేళనం కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో ఓం సంగీత నృత్యశిక్షణాలయం నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య శిష్య బృందం సంప్రదాయ సంగీతానికి శాస్త్రీయ నృత్యంతో అలరించారు. ప్రదర్శనా నంతరం వారికి అవోపా నాయకులు జ్ఞాపికలు బహూకరించి సత్కరించారు.

నేటి నుంచి చింతర్లపల్లిలో జాతర

శెట్టూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతర్లపల్లి గ్రామంలో సోమవారం నుంచి కొల్లాపురమ్మదేవి జాతర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ గౌరమ్మ, గ్రామస్థులు ఆదివారం తెలిపారు. సోమవారం జలధి పూజ, అమ్మవారి ఊరేగింపు ఉంటుందన్నారు. మంగళవారం అమ్మవారికి విశేష పూజలు, మేటి బాణం, జ్యోతులు నిర్వహిస్తారన్నారు. బుధవారం గావు, సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర ముగియనున్నట్లు వారు పేర్కొన్నారు.

18 నుంచి కడవకల్లులో దేవర

పుట్లూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు గ్రామంలో ఈ నెల 18వ తేదీ నుంచి రెండురోజుల పాటు పెద్దమ్మ దేవర ఘనంగా జరగనున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా 18వ తేదీ శనివారం రాత్రికి స్థానిక అమ్మ వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామన్నారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. 19వ తేదీ ఆదివారం తెల్లవారుజామున కూడా ప్రత్యేక పూజలు జరపనున్నట్లు చెప్పారు. దేవరకు ఇతర గ్రామాల నుంచిసైతం పెద్దఎత్తున భక్తులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

పాతకక్షలతో బైక్ దహనం

తాడిపత్రి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనాన్ని కాల్చివేశారని పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన హాజీవలి, కన్న అనే ఇద్దరికి పాతకక్షలు ఉన్నాయి. అయితే హాజీవలి బైక్‌లో వెళుతుండగా పెట్రోల్ అయిపోడంతో శివాలయం సమీపంలో పార్క్ చేసి పెట్రోల్ తెచ్చేందుకు వెళ్లాడు. దీనిని గమనించి కన్న ఆ బైక్‌కు నిప్పంటించి దగ్ధం చేశాడు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేశాడని, ఆ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో మరొకరు?

పుట్లూరు, జనవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుగారి కుంట గ్రామంలో రెండురోజులక్రితం టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడి తోటలో అరటిచెట్లు నరికివేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకోగా.. ఆదివారం మరొకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

కొనసాగిన క్రికెట్ పోటీలు

తాడిపత్రి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జేసీ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా మొదటి మ్యాచ్‌లో తాడిపత్రి ఆర్డీటీ, విఘ్నేశ్వర లివెంజర్ల జట్లు పోటీ పడ్డాయి. తాడిపత్రి ఆర్డీటీ జట్టు 73పరుగులు సాధించింది. విఘ్నేశ్వర జట్టు 49పరుగులు సాధించి ఓటమిపాలైంది. రెండో మ్యాచ్‌లో సునామీ సూపర్, రఘు లెవెన్ జట్ల మధ్య పోటీ కొనసాగింది. ఇందులో సునామీ సూపర్ 50పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన రఘులెవెన్ కేవలం 3.1ఓవర్లలోనే విజయాన్ని సాధించింది. వీటితోపాటు మరో మూడు మ్యాచ్‌లు జరిగాయని నిర్వాహకులు విజ్జి, సుధీర్, కందన్ తెలిపారు.

కోన రామలింగేశ్వరాలయానికి సీసీ రోడ్డు

యాడికి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనరామలింగేశ్వరస్వామి ఆలయ రహదారికి మహర్దశ రానుంది. రూ. 37లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. పనులను ఆదివారం టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం వద్ద నుంచి ప్రధాన రహదారిని కలుపుతూ సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. శివరాత్రి లోపు నిర్మాణాన్ని పూర్తిచేయనున్నట్లు చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కోన రామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులతోపాటు, జలపాతాన్ని చూడడానికి వచ్చే పర్యాటకులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట నాయకులు రామాంజనేయులు, రామకృష్ణ, సత్యంరెడ్డి, కత్తిమానుపల్లి భాస్కర్ రెడ్డి ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

గుంతకల్లుటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్యాంసన్ పురం వీధికి చెందిన యువకుడు వైటీ దినేష్(26) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గత ఏడాదిన్నార క్రితం అదే కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు దినేష్ తలపై బండారాయితో దాడి చేశారు. బలమైన గాయమవడంతో అప్పటినుంచి అతడి మానసిక పరిస్థితి బాగాలేదు. ఈ క్రమంలో ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. కొద్దిసేపటికి అతడి తల్లిదండ్రులు వచ్చి చూసి వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుత్తిలో వరుస చోరీలు

గుత్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున పలు చోట్ల వరుస చోరీలు జరిగాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాడిపత్రి రోడ్డులో వినాయక ట్రేడర్స్, సమీరా ట్రేడర్స్ దుకాణాలలో పైకప్పుల రేకులను గుర్తు తెలియని దుండగులు కట్ చేసి లోపలకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఇందులో ఆరు సెల్‌ఫోన్లు, రూ.7వేల నగదు అపహరించుకెళ్లారు. అదే విధంగా ఓ ఐరన్ మార్ట్ వద్ద ద్విచక్రవాహనాన్ని అపహరించారు. ఇక అనంతపురం రోడ్డులోని రివైండింగ్ షాపులో 20కిలోల కాపర్‌ను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ సురేష్ తన సిబ్బందితో సంఘటనా స్థలాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఏఐవైఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి

ఉరవకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకూ నిర్వహించే ఏఐవైఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవేంద్ర, నవీన్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

గుంతకల్లుటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 20వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈసందర్భంగా కౌన్సిలర్ ఆర్ పవన్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తలకు రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక పార్టీ టీడీపీనని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌గౌడ్, జబ్బీర్, గణేష్, రఘు, శ్యామ్, ఆలాం, శీనా, అరీఫ్, నాసిర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

గుత్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని పట్టణంలోని జడ్‌వీరారెడ్డి కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులపోటీలు, ఆటలపోటీలను ఆదివారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. నాయకులు మల్లికార్జున, రమేష్, కృష్ణవేణి, శ్యామల పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

తాడిపత్రి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని పట్టణంలోని వివేకానంద పాఠశాలలో ఆదివారం ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 50మంది పేద మహిళలకు చీరలను పంపిణీచేసినట్లు అధ్యక్షుడు గుర్రప్ప తెలిపారు. గౌరవాధ్యక్షుడు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కన్వీనర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికే గోకులం షెడ్లు: కలెక్టర్

బెళుగుప్ప, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతి కోసమే ప్రభుత్వం గోకులం షెడ్లను మంజూరు చేసిందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. మండలంలోని అంకంపల్లిలో ఆదివారం జరిగిన పల్లెపండుగ వారోత్సవాల్లో ఆయన పాల్గొని గోపూజలు చేసి గోకులం షెడ్లను ప్రారంభించారు. తర్వాత స్థానిక ఉన్నత పాఠశాలలో టీడీపీ నాయకులు నరేంద్ర, పురుషోత్తమ్, ఈశ్వరయ్య శ్రీనివాసులు, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంఈవో మల్లారెడ్డి, ఏవో పృథ్వీసాగర్, సూర్యప్రకాష్ తదితరులతో కలిసి మొక్కలు నాటారు. తర్వాత రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. పశుపోషణతో ఎంతో ఆదాయం చేకూరుతుందన్నారు. జిల్లాకు 1627 గోకులం షెడ్లు మంజూరు కాగా.. ఇప్పటివరకు 600 షెడ్లు నిర్మాణం పూర్తయ్యాయన్నారు. త్వరలోనే లక్ష్యాన్ని పూర్తి చేసి జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు లబ్ధిదారులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఎంపీపీ పెద్దన్న, సర్పంచ్, ఎంపీటీసీ, టీడీపీ నాయకులు రాధాకృష్ణ, తిమ్మప్ప, విరుపాపల్లి రాధాకృష్ణ, సునీల్ దబ్బర లక్ష్మీనారాయణ, బాలాజీ, శ్రీనివాసులు, వన్నూరుస్వామి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


గోకులం షెడ్డును రిబ్బన్‌కట్ చేసి ప్రారంభిస్తున్న కలెక్టర్, టీడీపీ నాయకులు

కోడి పందేల నిర్వహణ నేరం

సంక్రాంతి పండుగలో కోడిపందేలు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యా నేరమని, వాటిని నిర్వహించిన వారికి, పాల్గొన్న వారికి కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. అంకంపల్లిలో ఆయన తహసీల్దార్ షర్మిల, ఎంపీపీ, టీడీపీ నాయకులతో కలిసి ఈ మేరకు పోస్టర్లు ఆవిష్కరించారు.

చంద్రబాబు పాలనలో అభివృద్ధి పరుగులు: విప్ కాలవ


లింగదహాళ్‌లో గోకులం షెడ్డును ప్రాంభిస్తున్న విప్ కాలవ

బొమ్మనహాళ్: సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని లింగదహాళ్, కొళగానహళ్లి గ్రామాల్లో నిర్మాణం పూర్తయిన గోకులం షెడ్డును, సీసీ రోడ్డును ఆయన తుంగభద్ర ప్రాజెక్ట్ వైస్ ఛైర్మన్ కేశవరెడ్డితో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో అభివృద్ధి పనులు పూర్తిగా స్థంభించిపోయాయన్నారు. చంద్రబాబు రాకతో మళ్లీ అభివృద్ధి పట్టాలెక్కిందని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ అభివృద్ధికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గ్రామాల్లో సీసీరోడ్లు, రైతాంగానికి ప్రయోజనం చేకూర్చే గోకులం షెడ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో రూ. 16.46 కోట్ల నిధులతో 421 సీసీ రోడ్ల పనులు ప్రారంభించి ఇప్పటి వరకు 337 రోడ్లు పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులు పది రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే 328 గోకులాల మంజూరుకాగా, 219 ప్రారంభమై 113 మాత్రమే నిర్మాణం పూర్తయ్యాయన్నారు. గోకులం షెడ్ల నిర్మాణంలో వేగం పెంచాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి మల్లికార్జున, జేఈఈ జగదీష్, క్లస్టర్ కన్వీనర్ ధనంజయ, సాగునీటి సంఘం అధ్యక్షుడు గోవింద, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు శ్యామల, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండలంలోని బెణెకల్లు గ్రామంలో నిర్మించిన సీసీరోడ్లను, గోకులం షెడ్లను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రైతులు ఈ షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీడీపీ కన్వీనర్ లాలెప్ప నాయకులు రమేష్, ఎర్రిస్వామి, ఆనంద్‌రాజ్, ఆది, కళేకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, మాబుసాబ్, చంద్రశేఖర్‌గుప్తా, చాంద్ బాషా, బాయినేని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


నాగసముద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుంతకల్లు టౌన్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని నాగసముద్రంలో గోకులం షెడ్డును ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. నియోజవర్గంలో అర్హులైన రైతులు గోకులం షెడ్లను నిర్మించుకోవడానికి అనుమతి ఇచ్చామన్నారు. పాడి రైతులు గోకులం షెడ్లను వినియోగించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధిపనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, ఎంపీపీ మాధవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వాసిగిరి మణికంఠ, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లు ప్రారంభం

శెట్టూరు: మండల కేంద్రంలో నగేష్ అనే రైతుకు చెందిన మినీ గోకులం షెడ్డును టీడీపీ నాయకులు, అధికారులు ప్రారంభించారు. సర్పంచ్ కుమార్, ఏపీవో వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గురుప్రసాద్, నాగేష్, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని మిడుతూరులో గోకులం షెడ్లను టీడీపీ నాయకులు ప్రారంభించారు. సీనియర్ నాయకులు రమేష్‌యాదవ్, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పుట్లూరు మండలం కడవకల్లులో కలిసిన పూర్వవిద్యార్థులు


డీ హీరేహాళ్ మండలం సోమలాపురం పాఠశాలలో..

పుట్లూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఇందులో 2008-2009 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్లకు అదే పాఠశాలలో ఒక్కటిగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తాడిపత్రి ఎంఈఓ నాగరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

డీ.హీరేహాళ్: మండలంలోని సోమలాపురం ఉన్నత పాఠశాలలో 2001-02వ విద్యాసంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు 23 ఏళ్ల తర్వాత ఒక్కటిగా కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి గురువులను సన్మానించారు. సాయంత్రం వరకు అందరూ ఆనందంగా గడిపారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు చాలా ఏళ్ల తర్వాత ఒక్కటిగా కలుసుకున్నారు. ఆ పాఠశాలలో 1998-99వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన వారు మళ్లీ ఇన్నేళ్ల తర్వాత కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. ఎంఈవో మల్లారెడ్డి, హెచ్‌ఎం వెంకటప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: కంబదూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2010-11కు చెందిన పదో తరగతి విద్యార్థులు సుమారు 14 ఏళ్ల తర్వాత మళ్లీ అదే పాఠశాలలో ఒక్కటిగా కలిశారు. నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులను సత్కరించారు.


బెళుగుప్పలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..


కంబదూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

విజేతలకు బహుమతుల ప్రదానం

తాడిపత్రి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబాభవానీ ఆలయంలో ఆదివారం జరిగిన ముగ్గులపోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేషనల్ హైవే కర్నూల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాచురే సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన మహిళలకు ఆమె బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో స్వకులసాలి సమాజం రాష్ట్ర అధ్యక్షులు నాగేష్, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం పాఠశాలలో సంక్రాంతి సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో కార్యక్రమం చేపట్టారు. తర్వాత విజేతలకు బహుమతులు అందజేశారు.


తాడిపత్రిలో బహుమతిని అందజేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

పామిడి/గుత్తి/ఉరవకొండ/రాయదుర్గం రూరల్/యాడికి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): యువతకు స్ఫూర్తి ప్రధాతగా నిలిచిన స్వామి వివేకానందుడి జయంతి వేడుకలను పామిడి మండలకేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సరస్వతీ విద్యామందిరం పాఠశాలకు ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సరస్వతీ విద్యామందిరం అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. యువత స్వామీ వివేకానందుడి సూక్తులను అనుసరించాలన్నారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సరస్వతీ విద్యా పీఠం నాయకులు బీవీ రత్నమయ్య, చౌడయ్య, సునీల్‌కుమార్ రెడ్డి, జోజోడే కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. గుత్తి పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి రామాంజనేయులు, ఉపాధ్యాయులు, పాఠకులు స్వామి వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉరవకొండ పట్టణంలో విఠల్ రుక్మిణి ఆశ్రమంలో వివేకానందుడి జయంతిని నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకుడు ఎర్రిస్వామి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలువురు పూర్వ విద్యార్థులు వృద్ధులకు అన్నదానం చేశారు. రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. ఎన్‌ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ నారాయణ, అధ్యాపకులు ఎన్‌సీసీ వలంటీర్లు పాల్గొన్నారు. యాడికి మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో స్వామి వివేకానందుడి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్టార్ ప్యారడైజ్ హైస్కూల్, విజన్‌హైస్కూల్, వివేకానంద హైస్కూల్, శ్రీవిద్యహైస్కూల్, న్యూవికాస్ హైస్కూల్‌లో ఈ కార్యక్రమం జరిపారు.


పామిడిలో వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్.. ఆలయాల సందర్శన


బుగ్గరామలింగేశ్వరాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, కుటుంబసభ్యులు

తాడిపత్రి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలిగేశ్వరస్వామి, చింతల వెంకటరమణ స్వామి, వేదమాతగాయత్రీ అమరలింగేశ్వరస్వామి ఆలయాలతో పాటు షిర్డీసాయి బాబా, పుట్టపర్తి సాయిబాబా, శివసాయిబాబా మందిరాలను రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వెంకటరమణమూర్తి కుటుంబ సభ్యులతో ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో అర్చకులు వారికి ఘన స్వాగతం పలికి స్వామివార్ల దర్శనం చేయించి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించారు. ఆలయాల విశిష్టతను వివరించారు. అనంతరం శాలువాకప్పి తీర్థప్రసాదాలను అందజేశారు.

అమ్మవారికి మంగళసూత్రం చేయిస్తా: ఎమ్మెల్యే


కదిరిదేవరపల్లిలో లక్ష్మీనరసింహ స్వామిని దర్శిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని (ఫైల్)

కళ్యాణదుర్గం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కంబదూరు మండలం కదిరిదేవర పల్లిలో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అమ్మవారికి మంగళ సూత్రాన్ని సొంత ఖర్చులతో చేయించి ఇస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల క్రితం ఆలయానికి వెళ్లిన ఆయనకు గ్రామస్థులు గత కొద్ది రోజులక్రితం ఆలయంలో దొంగలు చొరబడి అమ్మవారి మంగళసూత్రం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారని వివరించారు. అమ్మవారికి కొత్త మంగళసూత్రాన్ని చేయించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన ఆ మేరకు హామీ ఇచ్చారు. అదేవిధంగా వెండి ఆభరణాలు కూడా దాతల సహకారంతో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. దీంతో గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలలో భక్తుల పట్ల వివక్ష తగదు: సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లుటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల పట్ల టీటీడీ బోర్డు వివక్ష చూపడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డీ జగదీష్ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల తిరుపతిలో వైకుంఠ దర్శన టోకెన్ల కోసం తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతిచెందడం బాధకరమన్నారు. టీటీడీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందన్నారు. ఉత్తర ద్వార దర్శనానికి ఒక్క రోజు మాత్రమే అవకాశం కల్పించడంతో భక్తుల రద్దీ అధికమైందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులు, టీటీడీ బోర్డు సభ్యుల లెటర్లు ఇస్తే వారికి బ్రేక్ దర్శనం కల్పిస్తున్నారని, 30 గంటలపైగా క్యూలో ఉన్న భక్తులకు దూరం నుంచి దర్శనం కల్పించడం దారుణమని అన్నారు. సామాన్య భక్తులను చిన్న చూపు చూడటం సబబుకాదన్నారు. పట్టణం, గ్రామీణప్రాంతాల్లోని పేద ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి స్థలాలతో పాటు రూ.4లక్షలు రుణం ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల స్థలాల ఉద్యమంలో భాగంగాఈనెల 24న పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కొత్తపేటకు చెందిన రవికుమార్, మసూద్ బైక్‌లో గుత్తి నుంచి ఇంటికి వెళ్తుండగా.. కొత్తపేట గ్రామశివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నాటుసారా తయారీని అరికట్టాలి

గుంతకల్లుటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాటుసారా తయారీని అరికట్టాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య సూచించారు. పట్టణంలో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో నాటుసారా తయారీని అరికట్టాలన్నారు. కర్ణాటక మద్యం, బెల్ట్‌షాపులపై నిఘా ఉంచాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సీఐ శివసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత నంద్యాల జట్టు

యాడికి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాయలచెరువులో నిర్వహించిన ఏపీ ఓపెన్‌బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో నంద్యాల నంది ఫైవ్స్ జట్టు క్రీడాకారులు ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. సంక్రాంతిని పురస్కరించుకుని రాయల్ ఫైవ్స్, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. గత రెండురోజుల నుంచి జరిగిన ఈ పోటీల్లో మొత్తం 22జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో నంద్యాల నంది ఫైవ్స్ జట్టు ఉత్తమ ప్రతిభ చూపి మొదటి బహుమతిని, వైజాగ్ సాంబ జట్టు రెండో బహుమతి, బనగానపల్లి జట్టు మూడో బహుమతిని, రాయలచెరువు జట్టు నాలుగో బహుమతిని గెలుపొందాయి. విజేతలకు ఆదివారం నగదు బహుమతులతోపాటు ట్రోఫీలను అందజేశారు. నిర్వాహకులు మాదాల రామకృష్ణ, కత్తి రమేష్, కూచి సూర్యనారాయణ, వాసీమ్ రాజా, మోటుపల్లి రాజశేఖర్, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, లయన్స్, లియోక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లోనూ రాణించాలి: ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి


పోటీల్లో పాల్గొన్న బాలికలతో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): బాలికలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సూచించారు. పట్టణ సమీపంలోని సౌభాగ్యసింధు ట్రస్ట్ బాలకల్యాణ ఆశ్రమంలో ఆదివారం నియోజకవర్గ కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలికలు పట్టుదలతో సాధన చేస్తే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం కబడ్డీలో సాయిచైతన్య టీం విజయం సాధించింది. సరస్వతి విద్యామందిరం టీం రన్నర్‌గా నిలిచింది. ఈ టీంలకు బహుమతులను అందజేశారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రభుత్వ విప్ కాలవ

బొమ్మనహాళ్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంతో గ్రామీణ యువతలో క్రీడల పట్ల ఆసక్తి తగ్గుతోందని, అలా కాకుండా ప్రతిఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఆదివారం పయ్యావుల అనిల్, పయ్యావుల శ్రీకాంత్, నవీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఎన్టీఆర్ కబడ్డీ టోర్నమెంట్‌ను కాలవ శ్రీనివాసులు, టీబీ ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ కేశవరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకునానరు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ యువత క్రీడలకు దూరం కాకుండా ఉండేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించడం హర్షణీయమన్నారు. క్రీడల వల్ల ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, నాయకులు వెంకటేశులు, మల్లీడు శీన, లక్ష్మిరెడ్డి, కేపీ వన్నూరుస్వామి, లాలూస్వామి, రమేష్ పాల్గొన్నారు.